హామీల అమలులో జగనన్నే ఆదర్శం

- ఆయన అడుగుజాడల్లో ప్రజల సంక్షేమానికి కృషి
- గాజువాకను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- 76వ వార్డులో జోరుగా ఎన్నికల ప్రచారం


విజయ తిలకం : బాలచెరువులో అమర్‌నాథ్‌కు హారతిచ్చి, బొట్టు పెడుతున్న మహిళ

పెదగంట్యాడ: ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని గాజువాక నియోజవకర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా మేనిఫెస్టో రూపొందించుకున్నానని, దాని ప్రకారం గాజువాకను మోడల్‌గా తీర్చిదిద్దుతానని అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి చిన కోరాడ, పెదకోరాడ, బాలచెరువు, బాబూ జగ్జీవన్ రామ్ కాలనీలో గురువారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ 76వ వార్డు ఇన్‌చార్జి దొడ్డి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులిచ్చి, విజయతిలకం దిద్దారు. అనంతరం ఆయన పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనతో పాటు విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అవ్వా తాతలను, దివ్యాంగులను ఆత్మీయంగా పలకరించారు. పెన్షన్ వచ్చిందా అంటూ ఆరా తీశారు.

అందుబాటులో ఉంటా..

గాజువాక నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని అమర్‌నాథ్ తెలిపారు. ఇప్పటి వరకూ ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాలను అందజేశామన్నారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మంత్రి శంకరనారాయణ, రంబ నారాయణమూర్తి, చిక్కా సత్యనారాయణ, శీరం రమణ, తాటికొండ జగదీష్, కాకినాడ పెంటారావు, అనపర్తి రమణ, పరంకుశం ప్రమీల, పత్రీ దేవి, రేవతి, శరత్, బ్రహ్మానందరెడ్డి, వేణుగోపాల్, రామజ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కోరాడలో ప్రచారం చేస్తున్న అమర్‌నాథ్


అవ్వా పెన్షన్ వచ్చిందా: వృద్ధురాలితో అమర్‌నాథ్ మాటామంతీ

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అక్కిరెడ్డిపాలెం: కణితి రోడ్డు, మింది, అక్కిరెడ్డిపాలెం, బీహెచ్‌పీవీ, షీలానగర్, గాజువాక, నాతయ్యపాలెం వాటర్ వర్క్స్, ఎయిర్-తుంగ్లాం ప్రాంతాల్లోని 11 కేవీ ఫీడర్లు, 33/11కేవీ బీహెచ్‌పీవీ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా దశమికొండ, పంతులు గారి మేడ, చిట్టినాయుడు కాలనీ, బీహెచ్‌పీవీ టౌన్ షిప్, చట్టివానిపాలెం, డెయిరీ క్వార్టర్స్, మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, పంచవటి, వివేకానంద కాలనీ, ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ ఏరియా (షీలానగర్) ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్‌ఈసీఎస్ పరిధిలో..

అగనంపూడి: ఆర్‌ఈసీఎస్ అగనంపూడి సెక్షన్ కార్యాలయ పర్యవేక్షణలోని మంగళపాలెం 33కేవీ సబ్‌స్టేషన్, 33 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వాహణ పనులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కశింకోట డీఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, దువ్వాడ సెక్టార్-1, మంగళపాలెం, కొత్తూరు, వెదుళ్లనరవ, శెట్టివానిపాలెం, లంకెలవానిపాలెం, నంగినారపాడు, అజనగిరి, గంగవరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

'ఈపీఎఫ్-95 పెన్షనర్లకు పింఛన్ పెంచాలి'


సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధి

అగనంపూడి: ఈపీఎఫ్ 95 పెన్షనర్లకు పింఛన్ పెంపుదల చేయనున్నట్టు ప్రధాన జాతీయ రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలని అగనంపూడి పెన్షనర్ల సంఘం కన్వీనర్ గుదే సుశీలా గజేంద్రరావు కోరారు. అగనంపూడిలో గురువారం నిర్వహించిన ఈపీఎఫ్-95 పెన్షనర్ల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ పెంపు కోసం 8 సంవత్సరాలుగా వివిధ రూపాల్లో పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న పార్టీలు పద్ధతి మార్చుకోవాలన్నారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 80వేల మంది పెన్షనర్లు ధర్నా చేస్తే ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు విందుల వరహాలు, బలిరెడ్డి సత్యనారాయణ, సాయిన సన్యాసిరావు తదితరులు మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎంకు అభినందనలు


హెచ్‌ఆర్ జీఎం భానును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి ఎన్.భానును గురువారం వివిధ సంఘాల నాయకులు అభినందించారు. ప్లాంట్ హెచ్‌ఆర్ నూతన ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, ఎన్నేటి రమణ, డి.అప్పలరాజు, నల్ల శ్రీను, బి.వి.రామయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు. స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ గుర్తింపు సంఘం నాయకులు ఆమెను కలిసి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.తాడన్న, బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం


కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. శిక్షకురాలు సుగుణ మహిళలకు జ్యూట్ బ్యాగులు, పెన్సిల్ పౌచ్‌ల తయారీ, డిజైన్‌లను వివరించారు. మహిళలతో నమూనాలు తయారు చేయించారు. మొదటి విడతగా 16 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా వీరు తయారు చేసిన బ్యాగులను ప్రదర్శించారు. కార్యక్రమంలో మానవ సేవే మాధవ సేవ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, ఎస్.సీతారామకృష్ణ, సహాయ కార్యదర్శి పి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పద్మశాలీలకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న అమర్‌నాథ్


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పద్మశాలి సంఘం సభ్యులు

పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి అమర్‌నాథ్

గాజువాక : ఎంతో చరిత్ర కలిగిన పద్మశాలి సామాజికవర్గానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రాధాన్యం లభించిందని ఆ పార్టీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గాజువాకలో నిర్వహించిన పద్మశాలి సామాజికవర్గ, చేనేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులతో పాటు డైరెక్టర్ పోస్టులను కూడా కేటాయించామని తెలిపారు. గాజువాకలో పద్మశాలి భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించి, నిర్మాణానికి కావాల్సిన సహకారం అందిస్తానన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా తగిన సీట్లు కేటాయిస్తామన్నారు. గత టీడీపీ హయాంలో చేనేత రంగాన్ని, పద్మశాలి సామాజికవర్గాన్ని నిర్వీర్యం చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే న్యాయం జరిగిందన్నారు. చేనేత రంగానికి వైఎస్సార్‌సీపీతోనే పూర్వవైభవం సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తెలంగాణ పద్మశాలి నాయకుడు డాక్టర్ పరికిపాండ అశోక్, చేనేత విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ సూరిశెట్టి సూరిబాబు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్, చేనేత విభాగం నేతలు రాపర్తి సుబ్బారావు, కొలిపాక అప్పారావు, శేశెట్టి అప్పారావు, వానపల్లి ఈశ్వరరావు, తెడ్లపు వెంకటేశ్వర్లు, పలివెల అమృత వల్లి, పెంటపల్లి వెంకట్, బొమ్మన పద్మ, తెడ్లపు సతీష్, సిద్ధనాతి సన్యాసిరావు, పప్పు అప్పారావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటాం

- ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్


సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్


సమావేశానికి హాజరైన ప్రజలు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలను ఎప్పుడూ గుండెల్లో పెట్టుకున్నారని గాజువాక నియోజవకర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ముందు నుంచి వారికెంతో ప్రాధాన్యం ఇచ్చిన ఆయన అధికారంలోకి రాగానే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి డిప్యూటీ సీఎం పదవినిచ్చి గౌరవించడం ఇందుకు తార్కాణమన్నారు. పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్ వద్ద మార్పుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని, స్మృతివనాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గానికి చెందిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని, అలాగే ఎమ్మెల్సీలుగా చేశారన్నారు. ఎస్సీ మహిళలకు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. మన ప్రాంతానికి చెందిన, ఎస్సీ వ్యక్తి అయిన గొల్ల బాబూరావును రాజ్యసభలో కూర్చోబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి న్యాయం చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో ఎస్సీ కాలనీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. వాటిని మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దుతామన్నారు.

యువత భవిష్యత్తుకు భరోసా

యువతకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పిస్తామని, వారికి మంచి భవిష్యత్తు కల్పించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. పారిశ్రామిక ప్రాంతం అయిన గాజువాకలో ఎటు చూసినా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. మీ అందరి ఆశీర్వాదంతో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనతో పాటు విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, గంట్యాడ గోవిందరాజు, మాటూరి శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.రాజారావు, వెంకటేష్, కాకినాడ పెంటారావు, కంచర్ల శ్రీదేవి, పాము రామశాస్త్రి, మీరాభాయ్, టేకేటి శ్రీను, పెద్దాడ కనకరాజు, కటికల కల్పన తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం


ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను గెలిపించాలని కోరుతూ 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష తదితరులు - అక్కిరెడ్డిపాలెం


స్టీల్‌ప్లాంట్ సెక్టార్-4లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ 78వ వార్డు ఇన్‌చార్జి రావాడ శివ, ఎన్.రమేష్‌కుమార్, అమ్మాజీ, ప్రవీణ్ తదితరులు - ఉక్కునగరం


వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ 85వ వార్డు కొండయ్యవలస, అట్టవానిపాలెం, పెదమడకల్లో ప్రచారం చేస్తున్న బలిరెడ్డి నాగేశ్వరరావు, గుర్రం శ్రీను తదితరులు - అగనంపూడి


75వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొందేశి శ్రీనివాస్‌రెడ్డి (బుజ్జి) ఆధ్వర్యంలో సీతానగరంలో ప్రచారం చేస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ సోదరి సురేఖ - పెదగంట్యాడ


వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో 64వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న అమర్‌నాథ్ శ్రీమతి హిమగౌరికి హారతిచ్చి స్వాగతిస్తున్న మహిళలు - పెదగంట్యాడ


87వ వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతవడ్లపూడిలో మహిళకు పార్టీ కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇల్లపు రాము - కూర్మన్నపాలెం


వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరుతూ కణితి ఆర్యవైశ్య కాలనీలో ప్రచారం చేస్తున్న కోమటి రమాదేవి - కూర్మన్నపాలెం


ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని విజ్ఞప్తి చేస్తూ దువ్వాడ సెక్టార్-1లో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, 88వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు - అగనంపూడి

సత్యజిత్ రే చిత్రాలు ఆణిముత్యాలు


సత్యజిత్ రే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ తదితరులు

సీతంపేట: ఆస్కార్ అవార్డు గ్రహీత, భారతరత్న సత్యజిత్ రే భారతదేశం గర్వించదగ్గ దర్శకుల్లో ఒకరని ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సత్యజిత్ రే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథి గోపీకృష్ణ మాట్లాడుతూ సత్యజిత్ రే తీసిన చిత్రాలు ఎప్పటికీ ఆణిముత్యాలుగా కీర్తి పొందాయన్నారు. ఆయన బెంగాలీలో చిత్రాలు తీసినప్పటికీ భాషా భేదం లేకుండా అందరికీ అర్థమవుతాయని చెప్పారు. అనంతరం భారత ప్రభుత్వ ఫిల్మ్ డివిజన్ రూపొందించిన సత్యజిత్ రే డాక్యుమెంటరీ ప్రదర్శించారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, బర్మన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంటకు వేలం

ఆరిలోవ: విశాఖ కేంద్రం కారాగారంలో మామిడి తోట ఫల సాయానికి గురువారం వేలం నిర్వహించారు. ఇక్కడ జైలు బయట ఉన్న మామిడి చెట్ల పంట వేలం వేశారు. ఓ వ్యక్తి మామిడి పంటను రూ.80 వేలకు దక్కించుకున్నారు. ఇక్కడ ఆవులు, గేదెలకు చెందిన 16 దూడలను మరో వ్యక్తి రూ.లక్షకు దక్కించుకున్నట్లు జైలు అధికారులు తెలిపారు.

ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించాలి


శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మిక సంక్షేమానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1176వ రోజు, గురువారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

మహిళా పక్షపాతి సీఎం జగన్


డ్వాక్రా మహిళల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ అనూష

ఉక్కునగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. మహిళా సాధికారత కోసం ఎన్నో చర్యలు చేపట్టారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉక్కునగరం సెక్టార్-11లో గురువారం నిర్వహించిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వయంసహాయక సంఘాలను బలోపేతం చేయడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గత ఐదేళ్లుగా అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా కోట్ల రూపాయలు చెల్లించి, డ్వాక్రా మహిళలకు అండగా నిలిచిందన్నారు. సంక్షేమ పాలన కొనసాగేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ, గాజువాక ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్ విజయానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంస్కృత భాష కంప్యూటరీకరణతో మేలు

సీతంపేట: సంస్కృత భాష వ్యాప్తికి కంప్యూటరీకరణ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆచార్య కోలవెన్ను మలయవాసిని అన్నారు. జిల్లెళ్లమూడి సంస్కృతి విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో 'సంస్కృత భాష-కంప్యూటరీకరణ' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా ప్రసంగించారు. అగర్తల ట్రిపుల్ ఐటీ పూర్వ డైరెక్టర్ పి.ఎస్.అవధాని మాట్లాడుతూ సంస్కృత భాష కంప్యూటరీకరణ పూర్వాపరాలను విశదీకరించారు. బి.గోపి మాట్లాడుతూ సంస్కృత భాష కోసం తాము రూపొందించిన కంప్యూటర్ గురించి విషయాలు సభికులకు వివరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, కె.వి.ఎస్.రాజేశ్వరరావు, జి.జానకీరామ్ సంస్కృత భాష కంప్యూటరీకరణలోని పలు అంశాలపై చర్చించి సూచనలిచ్చారు.